సాక్షి
తిరుపతి
శనివారం । 4 । జనవరి । 2025





## బతుకునే తన్నేశాడు!

పానీపూరీ తిని డబ్బులడిగినందుకు బండినే ధ్వంసం చేసిన ఘటన శుక్రవారం శ్రీకాళహస్తిలో చోటుచేసుకుంది. - IIలో



## ఎర్రచందనం స్వాధీనం

వాహనం సహా రూ.30 లక్షల ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్టు ఫారెస్ట్ రేంజర్ తెలిపారు. - IIలో



## సావిత్రి బాయి పూలే అవార్డు

సంతవేలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ సావిత్రిబాయి పూలే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. - IIలో

# న్యూస్‌రీల్

## తిరుమలకు కాలినడకన జాన్వీకపూర్



**తిరుమల:** బాలీవుడ్ నటి జాన్వీకపూర్ శుక్రవారం రాత్రి కాలినడకన తిరుమల చేరుకున్నారు. అలిపిరి మార్గం నుంచి నడుచుకుంటూ రాత్రి 11 గంటల సమయంలో తిరుమల చేరుకున్నారు. రాత్రి తిరుమలలోనే బస చేసి శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు.

## పర్యాటక కేంద్రంగా అరణియార్



అరణియార్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్

**నాగలాపురం:** పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టును మంచి టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దుతామని జేసీ శుభం బన్సల్ తెలిపారు. ఈ మేరకు అరణియార్ పర్యాటక అభివృద్ధి పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న టూరిజం డెవలప్‌మెంట్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా పిచ్చాటూరు జూనియర్ కళాశాలకు సంబంధించిన ప్రహరీ గోడ, అదనపు తరగతి గదులు, బాలికల వసతి గృహం, రోడ్డు నిర్మాణ పనులకు నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను నెల రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. అరణియార్ ఆయకట్టు సంఘ అధ్యక్షులు రవిరెడ్డి, తహసీల్దార్ రమేష్‌బాబు, ఆర్‌ఐ సుధాకర్, ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్‌రెడ్డి, వీఆర్వోలు కృష్ణ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి దర్శనానికి 12 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ స్వల్పంగా పెరిగింది. శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో 06 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 62,085 మంది స్వామివారిని దర్శించుకోగా 15,680 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.17 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

## ముక్కంటి సేవలో విదేశీ భక్తులు




ఆలయం వద్ద అమెరికా భక్తులు

**శ్రీకాళహస్తి:** జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం 70మంది అమెరికా భక్తులు దర్శించుకున్నారు. పెంచలకోన కరుణామయి ఆశ్రమ వ్యవస్థాపకురాలు భగవతి విజశ్వరదేవితో కలిసి వచ్చారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం వేదపండితులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# పూత.. మేత

విదేశాల్లో రోడ్లు అద్దాల్లా మెరిసిపోతాయని అక్కడికి వెళ్లి వచ్చినవారు చెబుతుంటారు. వారి మాటలు విన్నారో..లేదా స్వయంగా వెళ్లినపుడు పరిశీలించారోగానీ.. కూటమి నేతలు ఇవే మాటలను ఎన్నికల హామీల్లో గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే గుంతలు లేని రోడ్లు చూస్తారంటూ ప్రగల్భాలు పలికారు. ఆరు నెలలు గడిచాక ఇప్పుడు తీరిగ్గా సంక్రాంతికల్లా గుంతలకు ప్యాచ్ వర్క్‌లైనా పూర్తి చేయాలంటూ ఆదేశాలు జారీచేశారు. ఈ పనులన్నీ తమ పార్టీల నాయకులకే కట్టబెట్టడంతో వారు నాసిరకంగా దుమ్ము చల్లి.. జేబులు నింపుకుంటున్నారు. వారం రోజులు గడవక ముందే మళ్లీ గుంతలు పడడంతో స్థానికులు ఒకింత ఆశ్చర్యపోతూ ఔరా..? అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.





తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ ఎమ్మెస్ సుబ్బలక్ష్మి సర్కిల్ వద్ద మళ్లీ గుంతలమయమైన రోడ్డు

గుంతలమయంగా స్కావెంజర్స్ కాలనీ రోడ్డు

### జిల్లాలో రహదారులు చూడతరమా!

- ఇబ్బడిముబ్బడిగా ప్యాచ్ వర్క్‌లు
- నాసిరకం పనులతో జేబులు నింపుకుంటున్న కూటమి నేతలు
- వేసిన వారం రోజులకే మళ్లీ గుంతలు
- ముక్కున వేలేసుకుంటున్న జనాలు

**సాక్షి టాస్క్‌ఫోర్స్:** కూటమి ప్రభుత్వం చెప్పేదొకటి.. చేసేది ఇంకొకటి అన్నట్టుగా మారింది. అధికారమే పరమావధిగా ఎన్నికల్లో నోటికొచ్చిన హామీలు గుప్పించేశారు. సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టేశారు. రోడ్లు అద్దాల్లా మెరిసిపోయేలా తీర్చిదిద్దుతామంటూ నమ్మబలికారు. ఆపై అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తయ్యాక ఇప్పుడు తీరిగ్గా మేల్కొన్నారు. సంక్రాంతి పండక్కొచ్చే బంధువులు రోడ్లు చూసి అసహించుకుంటారని వెంటనే ప్యాచ్ వర్క్‌లు వేయాలని తమ అనుయాయులకు ఆదేశాలు జారీ చేశారు.



హోటల్ బ్లిస్ ఎదురుగా ఉన్న ఫ్లైఓవర్ సమీపంలో..

వారు చెప్పిందే తడవుగా కూటమి నేతలు కాంట్రాక్టర్లుగా అవతారమెత్తేశారు. నాసిరకంగా గుంతలు పూడ్చి మెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. ఇక అవి వారం రోజులకే మళ్లీ గుంతలు ఏర్పడడంతో వాహనదారులు విస్తుపోతున్నారు.

### రోడ్లు ఛిద్రం..బతుకు భద్రం

తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఇటీవల మూడు పర్యాయాలు కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ప్రధానమైనది రహదారుల మరమ్మతు పనులు ఒకటి. త్వరలో సంక్రాంతి పండుగ వస్తుండడంతో కూటమి ప్రభుత్వం హడావుడిగా రోడ్ల మరమ్మతు పనులకు నిధులు విడుదల చేసింది. వివిధ ప్రాంతాల నుంచి పండగకు సొంత గ్రామాలకు వస్తారని, వారు వచ్చేలోపు మరమ్మతు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ఇదే అదునుగా కూటమి నేతలు కాంట్రాక్టర్ల అవతారమెత్తి గుంతలకు ప్యాచ్ వర్క్‌లు వేస్తున్నారు. ఇలా వేసిన ప్యాచ్ వర్క్‌లు వారం రోజులకే మళ్లీ పాడైపోతున్నాయి. ఎన్నికలకు ముందు చెప్పిన మాటలు ఏమయ్యాయని కూటమి ప్రభుత్వ పెద్దలను వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

**రోడ్ల మరమ్మతులకు నిధులు**

| నియోజకవర్గం | పనుల సంఖ్య | మంజూరైన మొత్తం రూ.కోట్లలో |
|---|---|---|
| తిరుపతి డివిజన్ | 79 | 6.75 |
| వెంకటగిరి | 10 | 2.7 |
| గూడూరు | 3 | 1.2 |
| సూళ్లూరుపేట | 20 | 4 |



కోట: బస్సు వెళ్తున్న సమయంలో ఎగజిమ్ముతున్న దుమ్ము

### దుమ్ము..అదే వారి దమ్ము

తిరుపతి నగరంతోపాటు శ్రీకాళహస్తి, సత్యవేడు, కేవీబీపురం తదితర మండలాల్లో కాంట్రాక్టర్లు కుయుక్తులు పన్నుతున్నారు. తాము అధికార పార్టీకి చెందిన వారిమనే ధీమాతో నాసిరక పనులు చేసి వచ్చిన నిధులు భోంచేస్తున్నారు. ఇందులో అధికారులకు కొంత వాటాలిచ్చి వారిని అటువైపు రానీయకుండా చూసుకుంటున్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతలపై క్రషర్ దుమ్ము చల్లి నీళ్లు చల్లి రోడ్డు రోలర్‌తో తొక్కించి చేతులు పైకెత్తేస్తున్నారు. ఇలా వేసిన మూడు నాలుగు రోజులకే మళ్లీ గుంతలు ఏర్పడడంతో స్థానికులు అవాక్కవుతున్నారు.



తిరుపతిలో గుంతలమయంగా చాపల మార్కెట్ వయ దేవేంద్ర థియేటర్ రోడ్డు



మంగళంపాడు వద్ద రోడ్డుపై కంకర పోసి వదిలేసిన దృశ్యం



రేణిగుంటలో గుంతలు పూడ్చుతున్న సిబ్బంది



దామినేడు సమీపంలో ప్యాచ్ వర్క్



పోస్టల్ కాలనీ రోడ్డులో ప్యాచ్ వర్క్



తిరుపతి ఫ్లైఓవర్ సమీపంలోని ప్రధాన రోడ్డుపై ప్యాచ్ వర్క్ వేసిన సిబ్బంది

# సరస్వతీ ఒడిలో.. రాజకీయ కుంపట్లు!

### ఆరు నెలలుగా ఎస్వీయూ పాలన అస్తవ్యస్తం

- ఎటు చూసినా అవినీతి ఆరోపణలు, కక్ష సాధింపు చర్యలే
- అర్హతలేని స్థానాలకు వందల సంఖ్యలో ఉద్యోగుల బదిలీలు
- సక్రమంగా జీతాలు చెల్లించడం లేదంటూ ఉద్యోగుల ఆరోపణలు

**తిరుపతి టాస్క్‌ఫోర్స్:** సరస్వతీ నిలయమైన ఎస్వీయూలో రాజకీయ కుంపట్లు రాజేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎస్వీయూ ఏడీ బిల్డింగ్ రాజకీయ వేదికగా మారిపోయింది. గత ఆరు నెలలుగా జరుగుతున్న పాలన అస్తవ్యస్తంగా తయారైంది. అధికార పార్టీ అనుచరులను అధికారులుగా నియమించడంతోనే సమస్య ప్రారంభమైంది. వర్సిటీ అధికారుల వ్యవహార శైలిపై అటు ఉద్యోగులు, ఇటు విద్యార్థులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు పలుమార్లు అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నారు.

### రాజకీయ వేదికగా ఏడీ బిల్డింగ్

వర్సిటీ పరిపాలనా భవనంలో ప్రధాన అధికారుల పేషీలలో ప్రతినిత్యం అధికార పార్టీకి చెందిన, వర్సిటీకి సంబంధంలేని వ్యక్తులు హల్‌చల్ చేస్తుంటారు. దీనిపై ప్రసార మాధ్యమాలు, పత్రికలు కోడైకూసినా పట్టించుకున్న పాపాన పోలేదు. 70 ఏళ్ల వర్సిటీ చరిత్రలో మత విద్వేషాలు, ప్రచారాలు జరిగిన సందర్భాలు లేవు. అలాంటిది వర్సిటీలో అలజడి రేపి ప్రశాంతతను దెబ్బతీయాలనే ఉద్దేశంతో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నాలు జరిగి గందరగోళం సృష్టించారు. పలు విభాగాలలో అధ్యాపకుల కొరతను చూపించి సుమారు 300 మంది తాత్కాలిక అధ్యాపకుల నియామకాలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ కార్యకర్తల ఆదేశాల మేరకు వర్సిటీలో పాలన సాగుతోందని ఉద్యోగులు, విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### అందులోనూ రాజకీయమే

వర్సిటీలో పనిచేస్తున్న సుమారు 260 మందికిపైగా ఉన్న తాత్కాలిక ఉద్యోగులకు 110జీవో అమలు చేయకుండా సాగదీతతో సరిపెడుతున్నారు. సామర్థ్య పరీక్షల పేరుతో వారిని సాగనంపే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నట్లు అధ్యాపకులు చెబుతున్నారు. అలానే గత ప్రభుత్వం శాశ్వత అధ్యాపకుల నియామకం కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి నిరుద్యోగుల కడుపుకొట్టారని విమర్శలు ఎక్కుపెడుతున్నారు. అంచెలంచెలుగా తాత్కాలిక బోధనేతర సిబ్బందిని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని తొలగించి రోడ్డున పడేశారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా శాశ్వత ఉద్యోగులను సైతం ప్రాధాన్యత లేని పోస్టులకు బదిలీ చేశారు.



### వేతనాల వెతలు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెల నుంచే ఒకటో తారీఖున వేతనాలు జమ చేస్తామని ప్రగల్భాలు పలికిన బాబు సర్కార్ గత ఆరు నెలల్లో ఒక్క నెల సైతం సమయానికి జీతాలు చెల్లించిన పాపాన పోలేదు. రెండు, మూడు మాసాలకోసారి వేతనాలు చెల్లించడంతో ఉద్యోగులు అప్పులు చేసి, బంగారు తాకట్టుపెట్టుకుని కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోంది. వర్సిటీ పెన్షనర్ల పరిస్థితి వర్ణనాతీతం.

### కక్ష సాధింపు చర్యలేంటి?

వర్సిటీ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో సుమారు 150 మందికి పైగా ఉద్యోగుల అంతర్ బదిలీలకు తెరతీసిన అధికారులు పలు విమర్శలు ఎదుర్కొన్నారు. తమ అనుచర వర్గానికి, అధికార పార్టీకి అనుచరులుగా గుర్తింపు పొందిన ఉద్యోగులను అర్హత లేకున్నా ప్రాధాన్యత గల పోస్టుల్లో కూర్చోబెట్టారు. దీంతో పాటు తమ సామాజికవర్గానికి ప్రాధాన్యత కల్పిస్తూ ఉద్యోగులను, విద్యార్థి సంఘాలను ప్రోత్సహిస్తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేరిన ఉద్యోగులను విధుల నుంచి తొలగించి రోడ్డున పడేశారు.

### తుక్కునూ వదల్లేదు!

ఎస్వీయూలో గత 20 ఏళ్లకు పైగా పేరుకుపోయిన స్క్రాప్‌పై అధికారుల కన్నుపడిందని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. సుమారు రూ.60 లక్షల విలువగల స్క్రాప్‌ను ఎటువంటి టెండర్లు లేకుండా అధికార పార్టీకి చెందిన ప్రముఖ నేత ఆదేశాలతో పార్టీ అనుచరులకు రూ.8 లక్షలకే విక్రయించినట్లు విద్యార్థి సంఘాలు శుక్రవారం నిరసన చేపట్టాయి. ఈ మేరకు రిజిస్ట్రార్‌ను తన చాంబర్‌లో నిలదీశారు.



వీసీని నిలదీస్తున్న విద్యార్థి సంఘాలు

## ● మూగ వేదన



సత్యవేడు మండలంలోని పేరడం పాఠశాల వద్ద ఒక ఆవు పాఠశాల ప్రహరీ గోడ మధ్య ఇరుక్కుపోయింది. శుక్రవారం రెవెన్యూ సదస్సుకు పశువులతో నిరసన తెలిపేందుకు గ్రామస్తులు బర్రెలు, ఆవులను పాఠశాల ఆవరణలోకి తోలుకొచ్చారు. ఇందులో ఒక సూటి ఆవు ప్రహరీ–పాఠశాల గోడకు మధ్యన ఇరుక్కుపోయింది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఆవు రెండు గోడల మధ్య ఉండడంతో దాని యజమాని స్థానిక సర్పంచ్, ఎంఈఓలను గోడ తొలగించి ఆవును బయటకు తీయాలని కోరారు. స్పందించిన ఎంఈఓ డీఈఓకు సమాచారం అందించారు. అనంతరం ప్రహరీ గోడను కొద్దిగా తొలగించారు. వెంటనే గోమాత ప్రహరీ దాటుకుని పరుగులు తీస్తూ వెళ్లింది.

– సత్యవేడు

## యూకేను తాకిన పెట్లూరు నిమ్మ

**సైదాపురం:** దక్షిణ భారతదేశంలో నిమ్మ, చీనీ పంటల తయారీలో ఓ ప్రత్యేకతను సృష్టించుకున్న వెంకటగిరి సమీపంలోని పెట్లూరు నిమ్మ, చీనీ పరిశోధన కేంద్రానికి అరుదైన ఘనత దక్కింది. యూకే నుంచి భారత పర్యటనకు వచ్చిన పారిశ్రామికవేత్త హూగోబొవిల్ శుక్రవారం ప్రత్యేకంగా పరిశీలించారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఆయన డివిజన్ కేంద్రం గూడూరులోని సిఫల్ హెర్బల్ సంస్థ ఎండీ ఎలవర్తి విద్యాసాగర్, ఇండో వరల్డ్ ట్రేడింగ్ కార్పొరేషన్ (న్యూఢిల్లీ) ఉపాధ్యక్షుడు అనిల్ కాత్యాల్‌తో కలసి వెంకటగిరి రూరల్ మండలంలోని పెట్లూరు గ్రామ సమీపం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, పెట్లూరు నిమ్మ, చీనీ పరిశోధన స్థానాన్ని సందర్శించారు. నిమ్మ, చీనీ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పీ.శ్యామ్‌సుందర్ రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ ఖాందార్ నాయక్‌లతో నిమ్మ పంట విధివిధానాలు, సుగంధ ద్రవ్యాల్లో నిమ్మ ప్రాముఖ్యతపై ఆరా తీశారు.



నిమ్మ తోటలను పరిశీలిస్తున్న పారిశ్రామిక వేత్త

## క్లుప్తంగా

### రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అశ్విని



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకుంటున్న అశ్విని

**వాకాడు:** మండలంలోని కొండూరుపాళెం పాధ్యాయరాలు పీ.అశ్విని రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం సావిత్రీభాయి పూలే రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యారాలుగా అవార్డు అందుకున్నారు. భారత చైతన్య యువజన పార్టీ వారి ఆధ్వర్యంలో ఈ అవార్డును విజయవాడలో అందజేశారు. పలువురు ఆమెను అభినందించారు.

### 'విశ్వం'లో ఉచిత అవగాహన సదస్సు రేపు

**తిరుపతి ఎడ్యుకేషన్:** తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో ఆదివారం ఉదయం 10గంటలకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సదస్సులో పాల్గొనవచ్చని తెలిపారు. సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష వివరాలు, దరఖాస్తు చేసుకునే విధానం.. తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించనున్నట్టు తెలియజేశారు. సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు ఈ నెల 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### ఉపాధ్యాయుడి నిర్వాకంపై విచారణ

**చిల్లకూరు:** మండలంలోని ఉడతావారిపాళెం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడిపై విచారణ ప్రారంభమైంది. సదరు ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని గురువారం మండల విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై శుక్రవారం గూడూరు డిప్యూటీ ఇన్‌చార్జ్ ఈఓ సనత్‌కుమార్, చిల్లకూరు ఎంఈఓ రఫూప్‌లు పాఠశాలలో విచారణ చేపట్టారు. తల్లిదండ్రులతో పాటుగా, విద్యార్థినులను పిలిచి విచారించారు. అనంతరం ఉపాధ్యాయుడిని విచారించి నివేదిక సిద్ధం చేశారు. ఫిర్యాదు చేసిన చిన్నారులను వల్లిపేడుకు చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు, సచివాలయంలో పనిచేసే మహిళా పోలీసులు విచారణ చేసి అందుకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించనున్నట్టు తెలిపారు. అనంతరం డిప్యూటీ ఈఓ సనత్‌కుమార్ మాట్లాడుతూ పూర్తి వివరాలు జిల్లా విద్యాశాఖాధికారికి అందిస్తామన్నారు.

# వాయిదాల డీఎస్సీ!

**వరుసగా వాయిదాలు**
- గత ప్రభుత్వ నోటిఫికేషన్ రద్దు
- కొత్త నోటిఫికేషన్ ఇవ్వని కూటమి ప్రభుత్వం
- అయోమయంలో నిరుద్యోగులు



డీఎస్సీకి శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

**తిరుపతి అర్బన్:** సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి నేతలు అలవిగాని హామీలు గుప్పించారు. డీఎస్సీపైనే తొలి సంతకమంటూ ఉద్యోగులను ఊరించింది. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రమాణస్వీకారం నాడే చంద్రబాబునాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీపై చేశారు. ఆ తర్వాత ఏడు నెలలు గడిచినా ఇప్పటికీ నోటిఫికేషన్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. తాజాగా ఎస్సీ వర్గీకరణ నివేదిక వస్తేనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ అంటూ కొత్త రాగమందుకున్నారు. దీంతో నిరుద్యోగులు రగిలిపోతున్నారు.

**కోచింగ్ సెంటర్లలో వేలాదిమంది విద్యార్థులు**

డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందన్న ఆశతో వేలాది మంది బీఈడీ, టీటీసీ చదువుకున్న వారు కోచింగ్ సెంటర్లలో చదువుకుంటున్నారు. జిల్లాకు చెందిన 10 వేల మందికి పైగా నెల్లూరు, గుంటూరు, విజయవాడ, తిరుపతిలోని పలు కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. మరో 20 వేల మందికి పైగా పేద విద్యార్థులు ఇంటి వద్దే ప్రిపేర్ అవుతున్నారు. ఇప్పుడు జరుగుతున్న తంతు చూస్తుంటే వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి సైతం కొత్త ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయలేని పరిస్థితి నెలకొంది.

**ఆ నోటిఫికేషన్‌ను అమలు చేసి ఉంటే!**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 6,100 పోస్టులను భర్తీ చేయడానికి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషనను రద్దు చేసింది. మెగా డీఎస్సీ పేరిట 16,347 పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి, ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు స్పష్టమైన సంకేతాలు వెలువడలేదు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను అమలు చేసి ఉంటే ఇప్పటికే కొత్త ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉండేవారని పలువురు చర్చించుకుంటున్నారు.

**కుంటిసాకులతో వాయిదాల పర్వం**

కూటమి సర్కార్ కుంటిసాకులతో మెగా డీఎస్సీని వాయిదా వేస్తూ వస్తోంది. ఇప్పటికే మూడు సార్లు వాయిదాలు వేసింది. ముందుగా డీఎస్సీపై కోర్టు కేసులు పరిశీలించి, అడ్డంకులు తొలగించి, నోటిఫికేషన్ ఇస్తామని చెప్పింది. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణ కమిటీ సూచనల కోసం ఎదురుచూస్తున్నామని మెలిక పెట్టింది. ఎస్సీ కమిషన్ నివేదిక వచ్చేదెప్పుడో? ఆపై ప్రభుత్వం డీఎస్సీని నిర్వహించేదెపుడో? అర్థం గాని పరిస్థితి.

**మోసం చేయడం సరికాదు**



బీఈడీ, టీటీసీ చదువుకున్న పలువురికి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని కూటమి ప్రభుత్వం ఆశ చూపింది. సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం చేయడంతో గంపెడాశలు పెట్టుకున్నాం. అయితే ఏడు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు డీఎస్సీ నోటిఫికేషన్‌పై స్పష్టత లేదు. వచ్చే జూన్‌లోనైనా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం సాధ్యమేనా..? అనే అనుమానులు కలుగుతున్నాయి.

-జోగి సులక్షణ, చిల్లకూరు మండలం

**డీఎస్సీపై గంపెడాశలు**



డీఎస్సీపై గంపెడు ఆశలు పెట్టుకున్నాం. ఎంఎస్సీ, బీఈడీ చదువుకున్నాం. చాలీచాలనీ జీతాలతో ప్రైవేటుగా ఉద్యోగం చేసుకుంటున్నాం. అయితే డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టును సంపాదిస్తే కుటుంబ పోషణకు ఇబ్బందులు ఉండవని భావించాం. అయితే ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణలో జాప్యం చేస్తోంది. ఆలస్యం లేకుండా నోటిఫికేషన్ నిర్వహించాలని కోరుతున్నాం.

-బీ.శివకుమార్, ఎంఎస్సీ, ఎంఈడీ, సైదాపురం

**వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి**



వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి. వేలాదిమంది డీఎస్సీ పరీక్ష రాయడానికి శిక్షణ పొందుతున్నారు. ఏడు నెలల క్రితం ముఖ్యమంత్రి స్థాయి నేత డీఎస్సీ కోసం సంతకం చేస్తే.. దాన్ని పట్టించుకోకుంటే ప్రజల్లో నమ్మకం పోయే ప్రమాదం ఉంది. జాప్యం లేకుండా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు ప్రశాంత వాతావరణంలో పరీక్షను చేపట్టాలి.

-పీ.ప్రసన్న, వరదయ్యపాళెం, డీఎస్సీకి శిక్షణ పొందుతున్న నిరుద్యోగి

**ప్రాధాన్యత ఏదీ**



సాక్ష్యత్తూ సీఎం చంద్రబాబు నాయుడు పెట్టిన తొలి సంతకానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధాకరం. వెయ్యి కళ్లతో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాం. పరీక్ష రాయడానికి సిద్ధంగా ఉన్నాం. వేలాది మంది బీఈడీ, డీఎడ్ చదువుకున్న వారిని దృష్టిలో ఉంచుకుని తొలి సంతకాన్ని అమలు చేయాల్సి ఉంది.

-రవిశంకర్‌రెడ్డి-తిరుపతి, డీఎస్సీ అభ్యర్థి

### టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

**చంద్రగిరి:** యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 7వ తేదీ నుంచి 30 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై పూర్తి ఉచితంగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పీ.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల మహిళలు అర్హులన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు ఇస్తామని తెలిపారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 63017 17672లో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### 50 మందికి జరిమానా

**తిరుపతి లీగల్:** తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 50 మందికి ఒక్కొక్కరికీ పది వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపర్‌డెంట్ ఎన్‌వీ.సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఆపై కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీ నూతన సంవత్సరం సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు బనాయించారు.

### నూతన ఆవిష్కరణలు అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

**శ్రీకాళహస్తి:** నూతన ఆవిష్కరణల కోసం పరిశోధనలు అవసరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యావైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలను కలెక్టర్ తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు రేకెత్తించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. సమాజ హితం కోసం వినియోగించుకునేలా ఆవిష్కరణలు చేపట్టాలని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఉత్పాదకతను పెంచుకునేందుకు దోహదపడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి వ్యక్తిగత, విద్యార్థి సామూహిక, ఉపాధ్యా విభాగాల్లో జిల్లా స్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విజేతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. డీవైఈఓ ప్రభాకర్‌రాజు, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, భాస్కర్, ప్రధానపాధ్యాయులు రాజేశ్వరి, కృష్ణయ్య, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా పాఠశాలలో 9వ తరగతి చదివే ప్రత్యేక ప్రతిభావంతుడు చరణ్ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం అలరించింది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల బృందమ్మ ఆ విద్యార్థిని అభినందించారు.

### కార్మికుల పరస్పర దాడులు

**పెళ్లకూరు:** మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో ఉన్న ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో వేర్వేరు రాష్ట్రాలకు చెందిన కార్మికులు పరస్పర దాడులకు దిగిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మూడు రోజుల కిందట ఫ్యాక్టరీలో చోటు చేసుకున్న విస్ఫోటనానికి భయాందోళనలకు లోనైనా కొందరు కార్మికులు తమ వేతనాలు వెంటనే చెల్లిస్తే స్వగ్రామాలకు వెళ్లిపోతామంటూ యాజమాన్యానికి విన్నవించారు. ప్రమాదకరమైన యంత్రాల వద్ద పనులు చేసేందుకు పూర్తి స్థాయి రక్షణ కవచాలు అందుబాటులో ఉంచాలని మరికొందరు కార్మికులు కోరారు. ఏదో విధంగా పనులు చేసుకుంటూ జీవనం సాగిద్దామని ఇంకొందరు అక్కడే ఉండిపోయేందుకు నిశ్చయించుకున్నారు. ఇలా కార్మికుల మధ్య వాగ్వాదాలు తలెత్తాయి. దాంతో రెండు వేర్వేరు రాష్ట్రాలకు చెందిన కార్మికులు పరస్పర దాడులకు దిగారు.నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని కార్మికులతో మాట్లాడి సర్దుబాటు చేశారు.

### జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**కోట:** జాతీయ స్థాయి జూడో పోటీలకు చిట్టేడు ఎస్టీ గురుకుల కళాశాల విద్యార్థి టీ.సంతోష్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శేషవర్ధన్ శుక్రవారం తెలిపారు. సీనియర్ ఇంటర్ విద్యార్థి సంతోష్ గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో డిసెంబర్ 27 నుంచి మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని 80 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. జూడో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థిని ప్రిన్సిపల్‌తోపాటు పీడీ సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

### రుయాలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**తిరుపతి క్రైం:** తిరుపతి రుయా ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వెస్ట్ పోలీసుల కథనం.. రుయా హాస్పిటల్ సమీపంలోని ఓ నిర్మాణ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి పడిపోయినట్లుగా సమాచారం వచ్చింది. అయితే అక్కడ స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మృతుడి ఆచూకీ లభ్యం కాలేదు. అనారోగ్యంతో మృతి చెందాడా.. లేదా ఏదైనా ఇతర ఘటనలు చోటుచేసుకున్నాయా..? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

### గాయపడిన వ్యక్తి మృతి



మృతుడు ప్రసాద్ (ఫైల్)

**శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట):** రేణిగుంట మండలం, మర్రిగుంట సమీపంలోని జాతీయ రహదారిపై 30వ తేదీ రాత్రి రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి హాస్పిటల్లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని నల్లపాళెం గ్రామానికి చెందిన ప్రసాద్ (44), అలివేలు (35) భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై వస్తుండగా మర్రిగుంట సమీపంలోని పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై 30వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ఇరువురినీ తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రసాద్ (44) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు గాజులమండ్యం పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఆ తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. అలివేలు పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు సమాచారం. భర్త మృతి చెందడంతో భార్య అలివేలు రోదించిన తీరు చూపరులను కలచివేసింది. ఈ దంపతులకు చంద్రశేఖర్, సోమశేఖర్ ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# డబ్బులడిగినందుకు బతుకునే తన్నేశాడు!

- వలస జీవిపై దౌర్జన్యం



పానీపూరీ బండిని ధ్వంసం చేసిన దృశ్యం

**శ్రీకాళహస్తి:** బతుకుదెరువు కోసం ఊరుగాని ఊరొచ్చిన ఓ వలస జీవిపై దౌర్జన్యం చేశారు. పానీపూరి తిని డబ్బులు ఇవ్వకుండా ఆ బండినే కాలితో తన్ని రోడ్డుపై తోసేసి ధ్వంసం చేసి వెళ్లాడో పొగరుబోతు. ఈ ఘటన పుచ్చలపల్లి సుందరయ్య భవనం సాక్షిగా స్థానిక దక్షిణ కై లాస్ నగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పశ్చిమబెంగల్‌కు చెందిన ప్రదీప్ కుటుంబం బతుకుదెరువు కోసం పొట్ట చేతబట్టుకుని 20 ఏళ్ల క్రితం శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చింది. ప్రదీప్ దక్షిణ కైలాసనగర్‌లో పానీపూరి బండి పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి పానీపూరి తినేందుకు ప్రదీప్ వద్దకు వచ్చాడు. తీరా పానీపూరి తిన్నాక డబ్బులు అడినందుకు బండిని కాలితో తన్ని రోడ్డుపై తోసేసి ధ్వంసం చేశాడు. తర్వాత అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో చిరువ్యాపారి బండిని దౌర్జన్యంగా తోసేయడంపై స్థానికులు, పానీపూరి ప్రియులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రెండవ పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. సదరు వ్యక్తికోసం గాలిస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### 10 నుంచి టెన్నిస్ డబుల్స్ టోర్నీ

**తిరుపతి ఎడ్యుకేషన్:** ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్, టౌన్ క్లబ్‌లలో సనాల నాగముని మెమోరియల్ టెన్నిస్ డబుల్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు క్రీడా భారతి అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి దండు రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు 40 నుంచి 70ఏళ్ల పైబడ్డ రాయలసీమ జిల్లాలతో పాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. 40 ప్లస్, 50ప్లస్, 60ప్లస్, 70ప్లస్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామని, ప్రతి విభాగంలో విన్నర్స్ కు రూ.5వేలు, రన్నర్స్‌కు రూ.3వేలతో పాటు ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్టు తెలియజేశారు. ఇతర వివరాలకు 94911 45556, 94402 45980, 94412 96125 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.76 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,76,75,333 వచ్చింది. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద హుండీ లెక్కింపు నిర్వహించారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 73 గ్రాములు, వెండి 478,550 కిలోలు వచ్చింది. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన గుర్తుతెలియని యువకుడు

**నాయుడుపేట టౌన్:** పట్టణ పరిధిలోని మల్లాం జాతీయ రహదారి కూడలి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. మల్లాం జాతీయ రహదారి కూడలి వద్ద గుర్తుతెలియని యువకుడు రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొన్నట్లు స్థానికులు గుర్తించారు. వాహనం టైర్ తలపై వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ ఆదిలక్ష్మి పోలీసులతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అతని వద్ద ఎటువంటి ఆధారాలు లేక పోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. ఢీకొన్న వాహనం కోసం దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### సంతవేలూరు ఉపాధ్యాయురాలికి సావిత్రిబాయ్ పూలే అవార్డు



సావిత్రిబాయ్ పూలే అవార్డు అందుకుంటున్న సంతవేలూరు హైస్కూల్ ఉపాధ్యాయురాలు అమృత

**వరదయ్యపాళెం:** మండలంలోని సంతవేలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ అమృతకు సావిత్రిబాయ్ పూలే ఉత్తమ మహిళా ఉపాధ్యాయ అవార్డు దక్కింది. శుక్రవారం తిరుపతిలోని ఎస్వీ సెనేట్ హాల్‌లో జరిగిన సావిత్రిబాయ్ పూలే జయంతి కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి దాసరి శ్రీనివాసులు, యూనివర్సిటీ వీసీ అప్పారావు చేతుల మీదుగా అవార్డు అందుకుంది. హెచ్‌ఎం మాధవయ్య, సహచర ఉపాధ్యాయులు అవార్డు గ్రహీతకు అభినందనలు తెలిపారు.

**వరదయ్యపాళెం హైస్కూల్‌లో..**

సావిత్రిబాయ్ పూలే జయంతి కార్యక్రమాన్ని వరదయ్యపాళెం హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయ్ పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, పీడీలు బందిల కుమార్, వినోద్ పాల్గొన్నారు.

### ఆలస్యంగా మదురై ఎక్స్‌ప్రెస్

**నాయుడుపేట టౌన్:** నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో మదురై ఎక్స్‌ప్రెస్ శుక్రవారం కొన్ని నిమిషాలపాటు ఆగిపోయింది. మధ్యాహ్నం విజయవాడ నుంచి చెన్నైకి వెళుతున్న సమయంలో నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఎస్ఎస్ఆర్ కాలనీ వద్ద దూడ అడ్డుగా రావడంతో దాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దూడ అక్కడికక్కడే మృతి చెందింది. రైలు ఢీకొని దూడ పట్టాల పక్కనే పడిపోవడాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని లోకో పైలెట్ స్థానిక స్టేషన్ మేనేజర్‌కు సమాచారం అందించారు. సుమారు 5 నిమిషాల పాటు నాయుడుపేటలో ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచినట్లు ఎస్ఎం తెలిపారు.

### 2 కిలోల గంజాయి స్వాధీనం

**తిరుపతి క్రైం:** ఆటోనగర్ సమీపంలో రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘట శుక్రవారం చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు... రేణిగుంట రోడ్‌లోని పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న ఆటో నగర్లో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ఒడిశాకి చెందిన ప్రతాప్‌కుమార్ జైన్, తిరుపతికి చెందిన జంజర్ నింబరం గూలీజర్‌గా గుర్తించామన్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయి తో పాటు 21 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

### వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం

**భాకరాపేట :** వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజర్ వెంకట్రమణ పేర్కొన్నారు. స్థానిక ఫారెస్టు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం స్థానిక విలేకరులతో వివరాలు వెల్లడించారు. గురువారం రాత్రి శ్రీనివాస మంగాపురం వద్ద గల మిట్టపాళెం వంతెన వద్ద అటవీ అధికారులు మాటు వేశారు. వేకువజామున బొలేరో వాహనం అతి వేగంగా వెళ్లడంతో దాన్ని వెంబడించారు. తిరుపతి-రేణిగుంట బైపాస్ రోడ్డుమీదుగా వెళ్లిన వాహనం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ సర్కిల్ వద్ద ఆగింది. ఆ పక్కనే ఉన్న తుమ్మ పొదల్లో దూరి ఇద్దరు స్మగ్లర్లు పారిపోయారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 900 కిలోల బరువు గల 31 ఎర్రచందనం దుంగలతో కలిపి వాహనం విలువ రూ.40 లక్షలు ఉంటుందన్నారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం గాలింపు చేపట్టామన్నారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో ప్రదీప్‌కుమార్, ఎఫ్‌బీవో రాజేష్ కుమార్, రవి, శంకర్, ప్రభుతేజ, శ్రీనివాసులు, కేశవులు, అంజన్‌కుమార్, వినీల్‌కుమార్ పాల్గొన్నారు.

# 'కొత్త'పలుకు ఏమైందో?



మంగళం డిపోలో రిజిస్ట్రేషన్ కోసం ఉంచిన 18 కొత్త బస్సులు

**తిరుపతి అర్బన్:** జిల్లాలోని 11 డిపోల పరిధిలో 802 సర్వీసులు ఉండగా అందులో 774 సర్వీసులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగిలిన 200 సర్వీసులకు పైగా సరైన కండీషన్‌లో లేకపోవడంతో కష్టం మీద నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల అలిపిరి డిపోను సందర్శించిన రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి 2025 కొత్త సంవత్సరంలో సంక్రాంతి సమయానికి ఒక్కో జిల్లాకు 100 నుంచి 150 కొత్త సర్వీసులను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అయితే తిరుపతి జిల్లాకు 18 కొత్త బస్సులు మాత్రమే వచ్చాయి. అందులో వెంకటగిరి డిపోకు 8, వాకాడు డిపోకు 5, గూడూరుకు 4, మంగళం డిపోకు 1 సర్వీసును మంజూరు చేశారు.